రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. మల్లయ్య నాయుడు ఆదేశించారు. సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన శనివారం పరిశీలించారు. 16, 31వ సచివాలయాలకు చేరుకొని ఏ మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందో కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ సొంతింటి కల సాకారం చేసే విధంగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిందన్నారు. మంజూరు చేసిన ఇళ్ళ పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించి లబ్ధిదారులకు పూర్తి హక్కులతో లభించే విధంగా ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు. దీంతో అన్ని సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియలు చేపడుతున్నట్లు తెలిపారు.

విమానాశ్రయ నిర్మాణ పనుల్లో ఉపాధి కల్పన ఉత్తిమాటే!

విమానాశ్రయం వస్తే మీ ప్రాంతంలో అందరికీ ఉపాధి కలుగుతుందని అధికారులు, నాయకులు ఆశ చూపారు. దీంతో ఎకరా కోట్లలో ఉన్న భూమిని లక్షల్లోనే ప్రభుత్వానికి అప్పజెప్పారు. తీరా ఇక్కడ వారికి ఉపాధి కల్పించకుండా ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారికి నిర్మాణ సంస్థ ఉపాధి చూపడంతో ఖంగుతిన్నారు. నిర్మాణ సంస్థ కనీసం ఒక జాబ్ మేళా కూడా నిర్వహించి కనీసం చదువుకున్న వారికైనా సరే ఉద్యోగాలు కల్పించడం లేదని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తీరుపై మండిపడుతున్నారు. చివరకు అధికార పార్టీకి చెందిన నాయకులు ఈ ప్రాంత వాసులకు ఉద్యోగాలు కల్పించాలని నిర్మాణ సంస్థకు వినతి పత్రం ఇచ్చుకోవాల్సిన పరిస్థితి రావడం గమనార్హం.

విమానాశ్రయ నిర్మాణంలో పనిచేస్తున్న ఇతర రాష్ట్ర కూలీలు

జిఎంఆర్ సంస్థ ప్రతినిధికి వినతిపత్రం ఇస్తున్న అధికార పార్టీ నాయకులు

- స్థానికులకు ఉద్యోగాలు నిల్
- బయట రాష్ట్రాల వారికే ఉపాధి
- కనీసం జాబ్ మేళా కూడా నిర్వహించని నిర్మాణ సంస్థ
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి- భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని జిఎంఆర్ నిర్మాణ సంస్థ ఎల్అండ్టి సంస్థకు అప్పజెప్పింది. ఈ పనులు గత మూడు నెలలుగా జరుగుతున్నాయి. సుమారు 1500 మంది కూలీలు ప్రస్తుతం పనిచేస్తున్నట్లు సమాచారం. అయితే ఇందులో స్థానికులు కాకుండా బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఒడిశాకు చెందిన వారిని తీసుకువచ్చి పనులు చేయించుకుంటున్నారు. ఈ ప్రాంతానికి చెందిన వారికి మాత్రం ఉపాధి పనులు కల్పించడం లేదు. దీంతో వీరంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అవసరమైతే భూములకోసం పోరాడినట్లు ఉద్యోగాల కోసం కూడా రోడ్లపైకి వచ్చి పోరాటాలు, ధర్నాలు చేసేందుకు వెనకాడేది లేదని చెబుతున్నారు.

కనీసం జాబ్మేళా కూడా లేదు

విమానాశ్రయం నిర్మాణానికి మండలానికి చెందిన అనేక మంది రైతులు సుమారు 2700 ఎకరాల భూమిని ఇచ్చారు. భూసేకరణ సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి నిర్మాణం సమయంలో అనేక మందికి ఉద్యోగాలు వస్తాయని ఆశ చూపారు. అంతేకాక నిర్మాణం పూర్తయిన తరువాత కూడా అనేక ఉద్యోగాలు వస్తాయని నమ్మించారు. దీంతో చాలా మంది రైతులు మన ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు ఉపాధి అవకాశాలు వస్తాయని కోట్ల విలువైన భూమిని ప్రభుత్వ ధరకే ఇచ్చేశారు. విమానాశ్రయం పనులు ప్రారంభమై సుమారు మూడు నెలలు జరుగుతుంది. అయినా ఇప్పటివరకు విమానాశ్రయం నిర్మిస్తున్న జిఎంఆర్ సంస్థతో పాటు ఎల్అండ్టి సంస్థ కూడా ఒక్క జాబ్మేళా కూడా నిర్వహించలేదు. పోనీ కూలి పనులు కల్పించకపోయినప్పటికీ ఐటిఐ, డిప్లమా, బిటెక్ సివిల్ ఇంజినీరు చదువుకున్నవారు, ఈ ప్రాంతంలో ఉద్యోగాలు దొరక్క బయట రాష్ట్రాల్లో పనిచేస్తున్న వారికైనా ఉద్యోగాలు కల్పించేందుకు ఒక్క జాబ్మేళా కూడా నిర్వహించడం లేదు. ప్రజాప్రతినిధులు కూడా కనీసం నిర్మాణ సంస్థతో మాట్లాడి ఉద్యోగాలు కల్పించే పరిస్థితి లేదు.

ఉద్యోగాలు కల్పించాలని జిఎంఆర్ సంస్థకు వినతి

ఈ ప్రాంత వాసులకు ఉద్యోగాలు కల్పించాలని హౌసింగ్బోర్డు రాష్ట్ర డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్ బైరెడ్డి యర్రప్పలనారాయణ, మాజీ జెడ్పిటిసి బైరెడ్డి ప్రభాకరరెడ్డితో పాటు మరికొంత మంది జిఎంఆర్ సంస్థ ప్రతినిధి సుబ్బారావుకు రెండు రోజుల కిందట వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం పనిచేస్తున్నవారిలో సగం మంది స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

అభివృద్ధిపై మంత్రి బొత్స సమీక్ష

- యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులకు ఆదేశం
- రావివలస, తెట్టంగిలో సచివాలయ భవనాలు ప్రారంభం

అభివృద్ధి పనులను సమీక్షిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లి పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే బొత్స సత్యనారాయణ సమీక్షించారు. వివిధ శాఖల అధికారులు, మండల అధికారులు, పంచాయతీ సిబ్బందితో స్థానికంగా ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామంలో పది రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య పనులను నిర్వహించాలని, కాలువల్లో పూడికను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. గ్రామ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేయవలసిన, మర్మతులకు గురైన విద్యుత్ లైట్లు, రోడ్లు, తాగునీరు, కాలువలు తదితర అభివద్ధి కార్యక్రమాలపై సర్వే నిర్వహించి మూడు రోజుల్లో తనకు నివేదిక అందజేయాలని వార్డు కార్యదర్శులను మంత్రి ఆదేశించారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా, గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని తనకు నివేదించాలని మంత్రి స్పష్టం చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద ఇప్పటికే సుమారు కోటి రూపాయలతో పనులను మంజూరు చేసామని, అవసరమైతే మరో కోటి రూపాయలకు పైగా మంజూరు చేసి పనులు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ పనులను ఇఒపిఆర్డి, ఎంపిడిఒలు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లానచంద్రశేఖర్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ , జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రాజా, జెడ్పిటిసి వలిరెడ్డి శిరీష, ఎంపిపి ఇప్పిలి వెంకట నరసమ్మ, సర్పంచ్ ఎం.సుధారాణి, ఎంపిటిసి పతివాడ రాజారావు, ఎంపిడిఒ డి.శ్వేత, తహశీల్దారు ఎన్ ప్రసాదరావు, ఇఒపిఆర్డి అన్నపూర్ణాదేవి, ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది, వలిరెడ్డి శ్రీనివాసరావు, ఇప్పిలి అనంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆత్మ గౌరవాన్ని పెంచేందుకే పథకాలు

మహిళల ఆత్మ గౌరవాన్ని పెంచేందుకు అన్నింటా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మండలంలోని రావివలసలో జరిగిన గ్రామ సభలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న అవినీతి కూడా లేకుండా పారదర్శకంగా అర్హులైన ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానిదని అన్నారు. పథకాల కోసం ప్రజలెవ్వరూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా నేరుగా ఆయా గ్రామాలలోనే సచివాలయాల ద్వారా సేవలను అందిస్తున్నామని మంత్రి అన్నారు. గ్రామానికి స్మశానానికి రోడ్డు, కాలువలను ఉపాధిహామీలో మంజూరు చేసి పనులు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అంతకు ముందు నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కలక్టర్ త్రివినాగ్, జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంపిపి ఇప్పిలి వెంకట నర్సమ్మ, జెడ్పిటిసి వలిరెడ్డి శిరీష, సర్పంచ్ పనస మణికంఠ, ఎంపిటిసి కొమ్ము పద్మజ, రామలింగాపురం పిఎసిఎస్ పర్సన్ ఇన్చార్జి పనస అప్పారావు, తహశీల్దారు ఎన్.ప్రసాద రావు, ఎంపిడిఒ డి.శ్వేత, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సచివాలయాలు

గుర్ల : మండలంలోని తెట్టంగిలో సచివాలయ భవనాన్ని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం సచివాలయాలను నిర్మించిందని అన్నారు. ప్రజలకు అసరమైన అన్ని పనులూ పరిష్కారమవుతున్నాయని తెలిపారు. అవినీతి లేకుండా సంక్షేమ పతకాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదని అన్నారు. ఎంపిపి పొట్నూరు ప్రమీల, జెడ్పిటిసి శీర అప్పలనాయుడు, సర్పంచ్ జమ్ముపార్వతి, మండల పార్టీ అధ్యక్షులు స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి టిడిపి శంఖారావం

- జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పర్యటన
- రోజుకు మూడు నియోజకవర్గాల్లో సభలు
- టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ తలపెట్టిన శంఖారావం కార్యక్రమం ఈనెల 13 నుంచి 16వరకు నాలుగు రోజులు పాటు ఉమ్మడి జిల్లాలో జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున తెలిపారు. ఈ సభలను టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. శనివారం అశోక్బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ కార్యక్రమం ఏర్పాట్లు గురించి వివరించారు. రాష్ట్రంలో మెజారిటీ నియోజకవర్గాల్లో యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర కార్యకర్తలకు నూతన ఉత్తేజాన్ని ఇచ్చిందన్నారు. ఆ పాదయాత్ర ఇచ్చాపురం వరకు వెళ్లి అక్కడ ముగింపు పలకవలసి ఉండగా చంద్రబాబు అక్రమ అరెస్టుతో రెండు నెలలు విలువైన సమయం పోయిందన్నారు. పాదయాత్ర సమయంలో వెళ్లలేని నియోజకవర్గాల్లో శంఖారావం పేరిట సభలు పెడుతున్నట్లు తెలిపారు. అయితే ఈ కార్యక్రమం రోడ్ షో గాని, భారీ బహిరంగ సభలు గాని ఉండబోవని, నాయకులు కార్యకర్తలు గ్రామాల్లో ఉండే సాధికారత కుటుంబాలు మిత్రులు ఎవరైతే ఉన్నారో వారితో సమావేశాలు నిర్వహిస్తారని తెలిపారు. ఉమ్మడి జిల్లాల్లో 13వ తేదీ మధ్యాహ్నం పాలకొండలో సభను ముగింపు చేసుకుని ఆరోజు సాయంత్రం కురుపాం నియోజకవర్గానికి వస్తారన్నారు. రోజుకు మూడు నియోజకవర్గాల్లో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సభలు ఉంటాయన్నారు, 14న ఉదయం పార్వతీపురం, మధ్యాహ్నం సాలూరు, సాయంత్రం బొబ్బిలిలో సభలు నిర్వహించి రాత్రికి రాజాంలో బస చేస్తారని తెలిపారు. 15వ తేదీ ఉదయం రాజాం, మధ్యాహ్నం చీపురుపల్లి, సాయంత్రం ఎచ్చెర్లలో సభలు నిర్వహించుకుని రాత్రి నెల్లిమర్లకు చేరుకొని బసచేస్తారని తెలిపారు. 16న ఉదయం నెల్లిమర్ల, మధ్యాహ్నం విజయనగరం, సాయంత్రం గజపతినగరం నియోజకవర్గాల్లో సభలు నిర్వహిస్తామన్నారు. 16న రాత్రి ఎస్.కోట చేరుకొని రాత్రి అక్కడ బసవేసి మరుసటి రోజు 17వ తేదీ ఉదయం సభను నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం అక్కడి నుంచి అనకాపల్లి జిల్లాకు చేరుకుంటారన్నారు.

విజయనగరం నియోజకవర్గ ఇన్చార్జ్ అదితి విజయలక్ష్మి , నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్ఛార్జి కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనకు వ్యతిరేకంగా సమర శంఖారావాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు, మాడుగుల పరిశీలకులు కర్రోతు నర్సింగ రావు, కంది మురళీనాయుడు, కనకల మురళీమోహన్, విజ్జపు ప్రసాద్, ముద్దాడ చంద్రశేఖర్, ఎ.ఎ.రాజు, కోంద్రు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మరో అవకాశం ఇవ్వండి

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మరోసారి శాసనసభ్యునిగా ప్రజలె అవకాశమిస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. శనివారం నగరంలోని 10, 13 డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. రాజుల వీధిలోను, కూరాకుల వీధిలోను రహదారులు, కాలువలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. దాదాపు 75 శాతం మేర పనులు పూర్తి చేయగలగామన్నారు. మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్ విజయలక్ష్మి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, జోనల్ ఇన్చార్జులు ముద్దాడ మధు, స్థానిక కార్పొరేటర్లు ఇసరపు రేవతి దేవి, నాయన పద్మ, రామకృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

రహదారిని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, మేయర్ విజయలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు

అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మోహనరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్సిలో అప్రెంటెస్ విధానం రద్దు చేయాలని, ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను పెంచాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు డిమాండ్ చేశారు. శనివారం యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం యూత్హాస్టల్లో జిల్లా అధ్యక్షులు జె ఆర్ సి పట్నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల చేసిన డిఎస్సి నోటిఫికేషన్లో జీవో నెంబర్ 56 ద్వారా రెండేళ్ల అప్రెంటిస్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టడం అన్యాయమన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు జీవో నెంబర్ 7,8,9,10 ద్వారా సర్వీస్ రూల్స్ విడుదల చేశారని, వీటి ఆధారంగా ప్రభుత్వం ప్రమోషన్లు, బదిలీలను, పిఎఫ్ తదితరాలను ఈసర్వీస్రూల్స్ ప్రాతిపదిక చెయ్యాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్కె ఈశ్వరరావు మాట్లాడుతూ ఒపిఎస్ అమలు చేయాలని, ఓట్ ఫర్ ఒపిఎస్ నినాదంతో అన్ని పార్టీల నాయకత్వానికి పోస్టు కార్డు క్యాంపెయిన్ చేస్తున్నామని, మండల, నియోజక వర్గం, జిల్లా స్థాయిలో పార్టీ అధ్యక్షులకు వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో సిపిఎస్ రద్దుచేసి, పాత పెన్షన్ పునరుద్ధరణను అజెండాగాపెట్టాలన్నారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి, జిల్లా గౌరవాధ్యక్షులు మీసాల. అప్పలనాయుడు, సహాధ్యక్షులు వి.ప్రసన్న కుమార్, జి. పార్వతి, కోశాధికారి సిహెచ్ భాస్కరరావు, అకడమిక్ అధ్యయన బృందం సభ్యులు డి. రాము, రాష్ట్ర కౌన్సిలర్లు ఎ.సత్య శ్రీనివాస్, సి హెచ్ వెంకటరావు, నాయకులు కె.శ్రీనివాసరావు, కె.అప్పారావు, జి.పద్మావతి జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, పి త్రినాథ్,పక్కి వాసు, పి.వాసుదేవరావు, అర్.ఎవి సూర్యారావు, సిహెచ్ తిరుపతి నాయుడు, జి.రాజారావు, సూరి శ్రీనివాసరావు,అల్లు శంకరరావు, మండల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి, జెసి కార్తీక్, డిఆర్ఒ అనిత

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

పోలింగ్, కౌంటింగ్ విధులు మినహా ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇతర బాధ్యతలు నిర్వర్తించే ఎన్నికల అధికారులందరికీ ఈ నెలాఖరులోగా అవసరమైన శిక్షణ పూర్తిచేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లపై ఎన్నికల కమిషన్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జిల్లా కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణతో నేరుగా సంబంధం వున్న అధికారులు ఎవరైనా సోమవారం నాటికల్లా వారికి ఇచ్చిన పోస్టింగ్ల మేరకు చేరనట్లయితే తమకు తెలియజేయాలన్నారు. జిల్లాల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి కమ్యూనికేషన్ ప్లాన్, రవాణా ప్లాన్, ఓటరు ఫోటోగుర్తింపు కార్డుల పంపిణీ, ఓటర్ల జాబితాలకు సంబంధించిన అప్పీళ్ల పరిష్కారం, పోలింగ్ సిబ్బంది నియామకం, భద్రతా సిబ్బంది నియామకం తదితర అంశాలపై ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకున్నారు.

జిల్లాలో చేసిన ఏర్పాట్లపై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి వివరిస్తూ ఇప్పటికే పోలింగ్ అధికారుల వివరాలన్నీ ఎన్నికల వెబ్సైట్లో నమోదు చేశామని, మైక్రో అబ్జర్వర్ల సమాచారం కూడా నమోదు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో మరుగుదొడ్లు లేని కేంద్రాల్లో నిర్మాణాలను వారం రోజుల్లో పూర్తిచేస్తామని తెలిపారు.

జిల్లాలో ఒక పోలింగ్ కేంద్రానికి కేవలం ద్విచక్ర వాహనం ద్వారా మాత్రమే చేరుకునేందుకు అవకాశం వుందని, అక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ఐదు పోలింగ్ కేంద్రాలకు మొబైల్ కనెక్టివిటీ లేదని, కమ్యూనికేషన్ ఏర్పాట్లపై టెలికాం అధికారులతో చర్చిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికల అవసరాలకు 25 నుంచి 30శాతం మంది మాత్రమే భద్రతా సిబ్బంది అందుబాటులో వున్నారని, ఇతర యూనిఫాం సిబ్బంది సేవలను ఉప యోగించు కుంటామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్డి అనిత, ఆర్డిఒలు సాయిశ్రీ, ఎంవి సూర్యకళ, ఎస్డిసిలు మురళీకృష్ణ, సుధారాణి, ప్రమీలా రాణి, సిపిఒ పి.బాలాజీ, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డిఎస్ఒ మదుసూధన్, జిల్లా ఆడిట్ అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్లో సత్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక తోటపాలెంలోని సత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎస్.పల్లవి, సిహెచ్ శ్రీలక్ష్మి, ఈనెల 7నుంచి 9 వరకు హిమాచల్ ప్రదేశ్ లో జరిగిన అంతర్ జోనల్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పతకాలు సాధించారు. పల్లవి 64 కేజీల విభాగంలో స్నాచ్ – 80 కేజీలు జర్క్ – 100 కేజీలు మొత్తం 180 కేజీలు పూర్తి చేసి బంగారు పతకం సాధించింది. శ్రీలక్ష్మి 81 కేజీల విభాగంలో స్నాచ్ 83 కేజీలు, జర్కు 102 కేజీలు మొత్తం 185 కేజీలు పూర్తి చేసి రజిత పతకం పతకం సాధించింది.ఈ సందర్భంగా కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు , కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, ఎన్ సి సి ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్య వేణి, ఎం.ఉదయ్కిరణ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ . బి. సూరపు నాయుడు, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ చల్లారాము, అధ్యాపకులు పాల్గొని అభినందనలు తెలిపారు.

పతకాలు సాధించిన కళాశాల విద్యార్థులు ఎస్.పల్లవి, సిహెచ్ శ్రీలక్ష్మి

ఇదేనా రైతులపై చిత్తశుద్ధి?

ప్రజాశకి – విజయనగరం ప్రతినిధి

రైతుల సంక్షేమం, వ్యవసాయరంగ అభివృద్ధిపై మాటలు కోటలు దాటుతున్నా ఆచరణ గడపదాటడం లేదు. వారి సంక్షేమం, అభివృద్ధి సంగతి కాస్త పక్కనబెడితే, వ్యవసాయరంగం కోసం తలపెట్టిన సాగునీటి కాలువల ఏర్పాటులో కనీసం నీటివాటం కూడా తెలియని, తెలుసుకోలేని, పట్టని పరిస్థితుల్లో ఉన్నారు మన పాలకులు. హా... రైతులా పోతే పోనీ... అనుకున్నారో లేక వారి గురించి ఆలోచించడం వల్ల మనకేమిటి? అనుకున్నారో గానీ సుజల స్రవంతి కాలువ అలైన్మెంట్ మార్పు చేయాలంటూ రైతాంగం ఏడాదిగా మొత్తుకుంటున్నా అధికార పార్టీకి చెందిన నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులకు పట్టడం లేదు. సుజల స్రవంతి కాలువ ద్వారా ఉత్తరాంధ్ర జిల్లాలకు 8లక్షల ఎకరాలకు సాగునీరు, 2.30లక్షల జనాభాకు రోజుకు 4.46టిఎంసిల తాగునీటితోపాటు మొత్తం సాగునీటిలో 1శాతం నీటిని పారిశ్రామిక అవసరాలకు అందించాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఇందులో అత్యధికంగా సుమారు 3.94లక్షల ఎకరాల మేర ఉమ్మడి విజయనగరం జిల్లాకు రావాల్సి వుంటుంది. ఇందులో భాగంగా ఈ జిల్లాలో ప్రభుత్వం తలపెట్టిన కాలువల అలైన్మెంట్ వల్ల ఇప్పటికే సాగునీటి సదుపాయం ఉన్న సారవంతమైన భూములను ఎక్కువ మంది కోల్పోనున్నారు. ఇదే కాస్త ఎగువ ప్రాంతంలో తూర్పు కనుమలకు ఆనుకుని కాలువ అలైన్మెంట్ రూపొందిస్తే రైతుల నుంచి సేకరించాల్సిన భూమి తగ్గడంతోపాటు లిఫ్టల సంఖ్య 6నుంచి 4కు తగ్గుతుంది. భవిష్యత్తులో నిర్వహణ భారం కూడా ఆమేరకు తగ్గే అవకాశాలు ఉంటాయి. రైతులు, రైతు సంఘం నాయకులతోపాటు సాగునీటి పారుదల శాఖలో ఆరితేరిన ఇంజినీరింగ్ నిపుణులు సైతం ఇదే మాట చెబుతున్నారు. ఇలా ప్రత్యామ్నాయం మార్గం చూపడంతోపాటు భూసేకరణలో 2013 చట్టాన్ని అమలు చేయాలని కూడా రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వానికిగానీ, ప్రత్యేకించి మన జిల్లాకు చెందిన



ఎమ్మెల్యేలు, మంత్రులకుగానీ పట్టలేదు. దీంతో, రైతులంతా సంఘటితమై ఏడాదిగా అనేక సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకున్నారు. ఎప్పటికప్పుడు నిరసనలు వ్యక్తం చేసినా పాలకులకు పట్టకపోవడంతో రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టడడంతోపాటు తగిన కార్యచరణ రూపొందించేందుకు ఈనెల 2న గంట్యాడ మండలం తాటిపూడి వద్ద నిర్వాసిత రైతు సదస్సును నిర్వహించిన విషయం విధితమే. ఈ సదస్సుకు ఎస్.కోట, గజపతినగరం నియోపకవర్గాల పరిధిలోని సుమారు 50గ్రామాలకు చెందిన సుమారు 500 మంది రైతులు హాజరు కావడం విశేషం. సదస్సుకు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల తాజా, మాజీ ఎమ్మెల్యేలను కూడా ఆహ్వానించినప్పటికీ తాజాలు హాజరు కాలేదు. కనీసం రైతులకు వారి తరపున సందేశం తెలియ జేయడం, లేదా రాలేకపోవడానికి గలకారణాలను తెలియ జేయడం వంటివి కూడా లేదు. దీన్నిబట్టి అధికార పార్టీ ఎమ్మెల్యేలకు రైతుల సమస్యలపై ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. టిడిపికి చెందిన గజపతినగరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలువ అలైన్మెంట్ మార్చేవరకు పోరాడుతామని, ఇదే విషయాన్ని త్వరలో రానున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ దృష్టికి కూడా తీసుల్తానని హామీ ఇచ్చారు. ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను అన్యాయం చేయమే కాకుండా, ఏకపక్ష, నిర్బంద చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు.

అలైన్మెంట్ మార్పుకోసం జరుగుతున్న రైతుల పోరాటానికి వీరి వంతు ప్రయత్నం ఎలా ఉంటుందన్నది కాస్త పక్కనబెడితే సదస్సుకు హాజరు కావడం మంచి పరిణామమేనని రైతులు, ఇతర ప్రజానీకం అభిప్రాయపడుతున్నారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అసెంబ్లీలో చర్చకు వచ్చే విధంగా ప్రయత్నిస్తానని చెప్పినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. దీంతో, అధికార పార్టీ నాయకులు, ప్రభుత్వ తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిపిఎం మాత్రం తొలి నుంచి నికరంగా రైతుల పక్షాన మాట్లాడుతోంది. అలైన్మెంట్ మార్చేవరకు రైతుల పక్షాన పోరాడుతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, తమ్మినేని సూర్యనారాయణ హామీ ఇచ్చారు. దీన్నిబట్టి ఏ పార్టీ చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చని జనం చర్చించుకుంటున్నారు.

శాశ్వత భూహక్కు కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి - మెంటాడ

పేదల సాగు భూములకు శాశ్వత హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. భూసమస్యల శాశ్వత పరిష్కారం కార్యక్రమంలో భాగంగా 20ఏళ్లుగా సాగుచేస్తున్న నిరుపేదలకు శాశ్వత హక్కులు కల్పిస్తూ శనివారం జక్కువ గ్రామంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన హక్కు పత్రాలను పంపిణీ చేశారు. దీనికి ముందు గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వ్యవసాయానికి పెద్ద పీట వేస్తుందన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని సేవలు అందించడం జరుగుతుందన్నారు. 20ఏళ్లుగా సాగులోవున్న నిరుపేదలు 104 మందికి 106 ఎకరాలకు శాశ్వత హక్కు పత్రాలను అందజేశారు. జగన్ పాలనలో విద్య, వైద్యం,రోడ్లు, ప్రాజెక్టులు, సిసిరోడ్లు, బ్రిడ్జిల నిర్మాణాలు, ఆధునీకరణ చేసిన జగన్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత టిడిపి నాయకులకు లేదని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం, విద్య, వైద్యం అందించడంలో జగన్ ప్రభుత్వం ముందు ఉందని, ఈ విషయంలో టిడిపి నాయకులు సాలూరు బోసుబొమ్మ వద్ద గాని, విజయనగరం, పార్వతీపురం పట్టణాలలో ఏ సెంటర్ వద్ద నైనా విలేకరుల సమక్షంలో బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, నాయకులు లెంక రత్నాకర్ నాయుడు, తహశీల్దార్ త్రినాధ నాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లచ్చిరెడ్డి అప్పలనాయుడు, ఎ. గోకుల కృష్ణ, సర్పంచ్ ఎల్. సతీశ్, ఎంపిటిసి కర్రి సంధ్య, మెంటాడ, జక్కువ పిఎసిఎస్‌ల అధ్యక్షులు తాడ్డి రామచంద్రరావు, రెడ్డి అప్పా రావు, సాలూరు మహిళా పార్టీ అధ్యక్షులు సిరిపురం నాగమణి, మండల సచివాలయ కన్వీనర్ కనిమెరక త్రినాధరావు, నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కాపారపు పైడినాయుడు, పార్టీనేతలు కుపిరెడ్డి మోహన్, పాడిరెడ్డి అప్పలనాయుడు, అరుణ కుమారి, రెడ్డి రాజప్పలనాయుడు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

డిప్యూటీ సిఎం రాజన్నదొర

హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

శంఖారావ సభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గంట్యాడ

ఈనెల 16వ తేదీన జరగనున్న లోకేష్ శంఖారాం సభను విజయవంతం చేయాలని గజపతినగరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్చార్జ్ కొండపల్లి అప్పలనాయుడు అన్నారు. శనివారం గంట్యాడ కెపిఎన్ బిఈడి కళాశాలలో జరిగిన కార్యకర్తల అత్యవసర సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్యకర్త సైనికుడల పనిచేసి ప్రతి గ్రామం నుండి శంఖారావం సభకు జనాన్ని తరలించాలన్నారు. శంఖారాం సభలో రైతులు సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. పోలవరం ఎడమ కాలువ డిజైన్ మార్పు చేయడానికి కృషి చేస్తానని కొండపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం గురించి, భీమసింగ్ షుగర్ ఫ్యాక్టరీ గురించి లోకేష్‌కు తెలియజేస్తామన్నారు. సుజల స్రవంతి ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీరును అందించడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కర నాయుడు, కార్యదర్శి తల్లి చిన్నరామ నాయుడు, అల్లు విజయకుమార్, గోపాలరావు, బండారు బాలాజీ, బూడి అప్పలనాయుడు, రేవల్ల సతీష్, సీనియర్ నాయకులు రొంగలి కృష్ణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: జగన్ మోహన్ రెడ్డి, వైసిపి నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన నాధమే శంఖారావం అని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద ఆమె విలేకరులతో మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావంతో పర్యటించి జగన్ రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రజలకు, కార్యకర్తలకు తెలియజేయనున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకు టిడిపి 'శంఖారావం' అనే కీలక ప్రచారానికి శ్రీకారం చుట్టారన్నారు. శంఖారావం ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుంటారని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు జి.ఎస్ నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థలాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి శంఖారావ సభ స్థలి పరిశీలన

నెల్లిమర్ల: ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా నెల్లిమర్ల నియోజకవర్గంలో ఈనెల 16న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహించనున్న శంఖారావం సభ వేదికను టిడిపి నాయకులు శనివారం పరిశీలించారు. రామతీర్థం ప్రకృతి లేఅవుట్‌లో స్థలాన్ని టిడిపి నియోజక వర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మహంతి చిన్నం నాయుడు, ఇచ్ఛాపురం పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, నాయకులు కంది చంద్రశేకర్, పతివాడ అప్పలనారాయణ, నెల్లిమర్ల, భోగాపురం, డెంకాడ మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్, కర్రోతు సత్యనారాయణ, పల్లె భాస్కరరావు, నెల్లిమర్ల నగరపంచాయతీ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఆకిరి ప్రసాద రావు, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, నాయకులు కలిదిండి పాణిరాజు, లెంక అప్పలనాయుడు, అట్టాడ శ్రీధర్, దంగా భూలోక, అవనాపు సత్యనారయణ, గురాన చక్రధర్, పోతల రాజప్పన్న, నల్లం శ్రీనివాసరావు, తాడ్డి సత్యనారాయణ పరిశీలించారు.

వచ్చే ఎన్నికల్లో మీ ఆశీర్వాదం కావాలి

గొడుకొమ్ము గ్రామ సందర్శనలో ఎమ్మెల్యే కడుబండి

ప్రజాశక్తి - జామి

ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు ప్రారంభించారు. అందులో గ్రామ సందర్శన కార్య క్రమాన్ని రూపొందించారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు, సూచనలు మేరకు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు శనివారం జామి మండలం గొడుకొమ్ము గ్రామం నుంచి ఆనవాయితీగా ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సందర్శన పేరిట ప్రజల్ని కలిసి, వచ్చే ఎన్నికల్లో వారి ఆశీర్వాదం కావాలంటూ అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. శనివారం గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి, గత నాలుగున్నరేళ్లలో జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని పట్టుకొమ్ములుగా తమ పాలన నచ్చితేనే వివరిస్తూ, ఎన్నికల్లో మద్దతు కావాలని కోరారు. అందులో భాగంగానే గ్రామంలో పర్యటించి ప్రజలు, కార్యకర్తలతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జి.రవికుమార్, జెడ్‌పిటిసి సరయు, ఎంపిపి అరుణ, పి. సంతోష్‌రావు, గుడివాడ రాజేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పక్కిలో ఉచిత పశువైద్య శిబిరం

బొబ్బిలిరూరల్: ఎస్‌ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఎంపిపి సంబంగి లక్ష్మీ, వైసిపి నాయకులు వేణుగోపాల నాయుడులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వైద్యం అందించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో 50 పాడి ఆవులకు 20 దూడలకు 40 గొర్రెలకు, మేకలకు, 13 కోళ్లకు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం అందించినట్లు పశువైద్యాధికారి డాక్టర్ సుధాకర్ తెలిపారు. ఎస్‌ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ బొబ్బిలి బ్రాంచ్ మేనేజర్ ఏసుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మన్యాలపేటలో వైద్య శిబిరం

డెంకాడ: మండలంలోని జొన్నాడ పంచాయతీ మన్యాలపేట గ్రామంలో కిడ్నీ బాధితులు ఎక్కువ మంది ఉండటంతో శనివారం టిడిపి నాయకుల ఆధ్వర్యంలో హోమియోపతి వైద్యులు డాక్టర్ రమేష్ అధ్యక్షతన హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కిడ్నీ బాధితులందరికీ మెడికల్ టెస్టులు చేయించి సరిపడ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, భోగాపురం టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, సర్పంచ్ నారగాపు, కోరాడ రమేష్, సారిక అప్పారావు, త్రిపురగిరి శ్రీను, త్రిపురగిరి పైడిరాజు పాల్గొన్నారు.

వికలాంగులకు సేవ చేయడం అదృష్టం

కొత్తవలస: వికలాంగులకు సేవచేయడం అదృష్టంగా భావించాలని కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి అన్నారు. శనివారం ఎల్. షణ్ముఖ విశాల్ పుట్టినరోజు సందర్భంగా కొత్తవలసలోని చైతన్య మానసిక వికలాంగుల పాఠశాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996 నుండి చైతన్య పాఠశాల వికలాంగుల సేవలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. పాఠశాల ఫౌండర్ బోజంకి సన్యాసిరావు వికలాంగులకు చేస్తున్న సేవలపై సర్పంచ్ ఆనందం వ్యక్తం చేశారు. ఇటువంటి సంస్థలకు అందరూ సహకరించాలని కోరారు.

ఘనంగా పరదేశమ్మ జాతర ప్రారంభం

వేపాడ: మండలంలోని చిన్న గుడిపాలలో శనివారం మొదటి రోజు పరదేశమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారిని దర్శించుకొని మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రెండో రోజైన ఆదివారం ఎడ్ల పరుగు పందేలను నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

డిఇఒకు ఉపాధ్యాయ సంఘాల అభినందనలు

విజయనగరం టౌన్: డిఇఒగా బాధ్యతలు చేపట్టిన ఎన్. ప్రేమ్ కుమార్ ను జిల్లాలోని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. యు టిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.రమేష్ చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్రనాయకులు డి.రాము, వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్.వెంకటనాయుడు, ఎల్ వి రమణ, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు, డిఏఆర్‌టిఏ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు కంది వెంకటరమణ తదితరులు కలిసి అభినందనలు తెలిపారు. డిఇఒ మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి సహకరించి, రాష్ట్రంలోనే జిల్లా విద్యాశాఖ అగ్రభాగాన ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్స్ అందజేత

విజయనగరం కోట: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 40 మొబైల్స్‌ను సైబర్ సెల్ పోలీసులు ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నారు. శనివారం వాటిని సైబర్ క్రైం పోలీసుస్టేషన్ వద్ద సిఐ టివి విజయకుమార్ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – సైబర్ సెల్ పోలీసులకు మొబైల్ ఫోన్లు పోయినట్లుగా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా మొబైల్స్ ను ట్రేస్ చేసేందుకు సైబర్ సెల్ పోలీసులు, సిబ్బంది నిరంతరం చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల గురించి ఫిర్యాదు చేసిన కొద్ది రోజుల్లోనే 40 మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసామన్నారు. వీటిని ఎస్పి ఆదేశాలతో బాధితులకు అందజేసినట్లు తెలిపారు. పోయిన మొబైల్స్ గురించిన ఫిర్యాదులను https://www.ceir.gov.in అనే లైను ద్వారా గాని, సైబర్ క్రైం పోలీసు స్టేషనులో గాని నేరుగా చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సైబర్ సెల్ ఎస్ఐలు ప్రశాంత కుమార్, నజీమా బేగం, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

రేగిడి: మండలంలోని మునకలవలస, పసనలవలస, పారంపేట, కాగితాపల్లి తదితర గ్రామాల్లో శనివారం రాజాం వైసిపి ఇంచార్జి తలే రాజేష్ ఆధ్వర్యంలో 200 కుటుంబాలు టిడిపి నుంచి వైసిపిలోకి వచ్చి చేరికలు నిర్వహించారు. వీరికి వైసిపి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారన్నారు. అనంతరం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్ర మం లో వైస్ ఎంపిపి వావిలపల్లి జగన్మోహనరావు, సచివాలయ మండల కన్వీనర్ కింజరాపు సురేష్ కుమార్, చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

పివికి భారతరత్న గర్వ కారణం

బొబ్బిలి: దేశ మాజీ ప్రధానమంత్రి పివి నరసింహారావుకు భారతరత్న రావడం తెలుగు ప్రజలకు గర్వమని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ అన్నారు. లోక్‌సత్తా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ రాజకీయ పదవులలో పివి నరసింహారావు దేశాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఢిల్లీలో పీవీ భారతరత్న అవార్డు వచ్చింది దీని మీద మీ స్పందన ఏమిటి అని జగన్మోహన్ రెడిని ఢిల్లీలో మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా పక్కనున్న వాళ్ళు చెప్తారు అని చెప్పడం సిగ్గుచేటనిని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు మరో ప్రకటనలో తప్పుబట్టారు.

19న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని కోరుతూ ఈనెల 19న కలెక్టరేట్ వద్ద జరుగనున్న ధర్నాను జయప్రదంచేయాలని ఎపి రజక సంఘం జిల్లా అధ్యక్షుడు.టి.భాస్కరరావు పిలుపునిచ్చారు. శనివారం నగరంలో రజక కాలనీల్లో ప్రచారం నిర్వహించి అనంతరం ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటిన రజకులు జీవితాల్లో మార్పు లేదన్నారు. ఉపాధి లేక,ఉద్యోగ అవకాశాలు లేక ఆర్థికంగా నేటికీ వెనుకబడి ఉన్నారన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి కావాలంటే రజకులు ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు. ఈనేపథ్యంలో నిర్వహించనున్న ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శీల తాతారావు, కార్యదర్శి జంపా చిన్నరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయండి

తెర్లాం: ఈ నెల 16న దేశ వ్యాప్తంగా చేపట్టనున్న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు, మండల నాయకులు ఎస్. గోపాల్ పిలుపునిచ్చారు. మండలంలోని పలుకువలస సెంటర్ బంద్ పై శనివారం ప్రచారంచ చేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులతో మాట్లాడుతూ తమ సొంత కాళ్ళ మీద బతుకుతున్న ఆటో కార్మికులపై మోడీ, జగన్ ప్రభుత్వాలు దొంగ దెబ్బతీస్తున్నాయన్నారు. మోటార్ వాహనాలపై రూ.700 నుండి రూ.15 వేల వరకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ భారాన్ని సుమారు రూ. 1000 కోట్లు భారాన్ని వేసిందన్నారు. ఈ నేపథ్యంలో చేస్తున్న రవాణా బందును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు పి. తిరుపతిరావు ఎం. గణపతి ఆటో కార్మికులు పాల్గొన్నారు.

నేడు గ్రామ సందర్శన

వేపాడ: మండలంలోని బానాదిలో ఆదివారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షులు ఎం జగన్నాథం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరవుతారని ఎంపిపి, జెడ్‌పిటిసితో సహ సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంత చేయాలని ఆయన కోరారు.

శారదా కంపెనీ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి కంటకాపల్లి వద్ద నున్న శారదా కంపెనీ చేస్తున్న సేవలు మరువలేనివని కడుబండి శ్రీనివాసరావు అన్నారు. శనివారం శారద కంపెనీ ఎండి నీరజ్‌తో కలిసి ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలోగల పాత సుంకరపాలెంలో సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన పాఠశాల అదనపు తరగతి భవనం, కంటకాపల్లి, కాటకాపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో శారదా కంపెనీ సహకారంతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శారద కంపెనీ యాజమాన్యం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. గత నాలుగున్నర ఏళ్లల్లో జగనన్న పాలనలో అభివృద్ధికి, సంక్షేమానికి పట్టుకొమ్మలుగా నిలిచిన గ్రామాలలో పర్యటించి ప్రజలు కార్యకర్తలతో మమేకమవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, కంటకాపల్లి సర్పంచ్, మదిన అప్పలరామ్, కాటకాపల్లి సర్పంచ్ పీతల కృష్ణ, ఎంపిటిసి అప్పల పరదేశి నాయుడు, అయ్యారక పాత్రుల డైరెక్టర్ పిఎస్ఎన్ పాత్రుడు, చినరావుపల్లి సర్పంచ్ బుసాల దేవుడు, శారదా కంపెనీ సీనియర్ జనరల్ మేనేజర్ ప్రభాత మోహన్, అనంత్ కుమార్, సన్యాసి రావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

సమస్యల పరిష్కారానికి ఆశాల ర్యాలీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఆశ వర్కర్లపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతోందని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిల రమణ మాట్లాడుతూ రోజు రోజుకీ మార్కెట్‌లో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. వీటికి అనుగుణంగా ఆశా వర్కర్లకు కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఒకే యాప్‌లో పనులు చేపట్టాలని, అర్హత కలిగిన ఆశా వర్కర్లను సెకండ్ ఏఎన్ఎంలుగా తీసుకోవాలని, ఏఎన్ఎంల నియామకానికి జరిగే ఎగ్జాముల్లో ఆశా వర్కర్లకు వెయిటేజ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి డిమాండ్ల పరిష్కారానికి సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని, ఓపక్క యూనియన్ ప్రతినిధులతో చర్చిలకు పిలిచి తిరిగివస్తున్న యూనియన్ ప్రతిని ధులను ఆశావర్కర్ల నాయకులను పోలీసులతో అరెస్టు చేయించిందని, దీనికి నిరసనగా 9,10 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం నిరసన కార్యక్రమం చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ ముత్యాలు, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు బి విమల, రమణమ్మ, కే రాజేశ్వరి, ఆర్ శ్రావణి, ఎల్ యోగిని, కె.లక్ష్మి, ఎస్.కన్నమ్మ, టి.లక్ష్మి పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న సిఐటియు నాయకులు, ఆశాలు

ఆరోగ్యశ్రీ కార్డులు అందించాలి

ప్రజాశక్తి - వేపాడ

ఆరోగ్యశ్రీ కార్డులను అర్హులకు అందించాలని, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఇంఛార్జి ఎంపిడిఒ ఉమా తెలిపారు. శనివారం ఆమె సచివాలయ ఉద్యోగులకు జాబ్‌సార్ట్‌పై పలు సూచనలు చేశారు. లబ్ధిదారులచేత ఆరోగ్యశ్రీ యాప్ అప్లోడ్ చేయించాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రతి గ్రామ సచివాలయానికి విడుదలయ్యాయని, గ్రామ సర్పంచ్, ఎంపిటిసి, పంచాయతీ పాలకవర్గంతో సమావేశాలు ఏర్పాటు చేసి, గ్రామంలో అవసరమైన పనులను గుర్తించి గ్రామసభ ఆమోదం మేరకు ప్రతిపాదనలను పంపించాలన్నారు. బిఎల్ఒలుగా పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు ఓటరు జాబితాలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తప్పులు జరిగితే అందుకు బాధ్యులైన వారిపై వేటు తప్పదని హెచ్చరించారు. గ్రామాలలో పారిశుధ్య పనులు, పంచాయతీకి రావలసిన వివిధ ఆదాయాలను వసూలు చేయడంపై కూడా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలాఅభివృద్ధి చెందాలంటే ఈ కార్యదర్శులు మూల స్తంభాలని ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

అవసరమైన పనులను గుర్తించాలి

ప్రజాశక్తి- వేపాడ

గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి ఉపాధి హామీ ద్వారా చేపట్టుకోవాలని ఎపిఒ ఆదిలక్ష్మి అన్నారు. ఆమె శనివారం ప్రజాశక్తితో మాట్లాడుతూ గ్రామాల్లో పనులు గుర్తింపునకు గ్రామ సభలు నిర్వహించుకోవాలన్నారు. గుర్తించిన పనులకు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఆమోదించుకోవాలన్నారు. ఈ సభలను ఈ నెల 12న అరిగి పాలెం, 13న కొంపల్లి, 14న ఎన్‌కెఆర్ పురం, రాయుడుపేట, 15న పాటూరు, 16న ముకుందపురం, రామస్వామిపేట, ఎఎస్‌పేట, ఆతవ, వల్లంపూడి, 19న గుడివాడ, జాకేరు, 21న పికెఆర్‌పురం, జగ్గయ్యపేట, బల్లంకి, డిఆర్‌పేట గ్రామాలలో గ్రామసభలు నిర్వహించాలన్నారు. ఈ గ్రామ సభలలో డిఆర్‌పిలు నరసింహ మూర్తి, జి. జగదీష్, వెంకటేశ్వరరావు, బి శ్రీను తదితరులు పాల్గొంటారని చెప్పారు. ఈ గ్రామ సభలను ప్రజా ప్రతినిధులు ఆధ్వర్యంలో నిర్వహించి గ్రామాభివృద్ధికి ఉపయోగించుకుంటారని ఎపిఒ కోరారు.

రోటరీ ఆధ్వర్యాన సెమినార్

ప్రజాశక్తి- బొబ్బిలి

అంతర్జాతీయ రోటరీ సంస్థ 3020 ఆరు జిల్లాల నాయకులకు శనివారం స్థానిక టిబిఆర్ కన్వెన్షన్‌లో 6 అంశాలలో రోటరీ డిస్ట్రిక్ట్ ఎలెక్ట్ డాక్టర్ వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు, రీజినల్ కార్యదర్శి తూముల కార్తిక్ పర్యవేక్షణలో నిర్వహించారు. ముందుగా ఈ రెండురోజుల సెమినార్ కార్యక్రమాన్ని ముఖ్య అదితి పీడీజి రమేష్ జ్యోతి ప్రరోటరీ సభ్యత్వం, పబ్లిక్ ఇమేజ్, పోలియో నిర్మూలనం, రోటరీ ఫౌండేషన్, ఆన్‌లైన్ టూల్స్‌పై పీడీజి భాస్కర రామ్, పిడిజి రామారావు, పిడిజి కిషోర్ కుమార్, పిడిజి వీరభద్ర రెడ్డి, పిడిజి పూషా, పిడిజి విశ్వనాథ్ సెమినార్‌ను నిర్వహించారు. అనంతరం రోటరీ సేవా సంభదిత కాలదర్శిని పూర్వ జిల్లా గవర్నర్‌లు విడుదల చేశారు. ముఖ్య అధితిగా హాజరైన రమేష్ కనగాల, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రోటరీ జిల్లా వ్యాప్తంగా సేవాకార్యక్రమాలను విస్తృత పరచేలా రోటరీ జిల్లా నాయకులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రోటరీ పూర్వ జిల్లా గవర్నర్లు బొబ్బిలి రోటరీ సభ్యులు కిషోర్, శ్రీహరి, శ్రీనివాసన్, శ్రీనివాసరావు, ప్రవీణ్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు సీట్లు కేటాయించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

రానున్న ఎన్నికల్లో జిల్లాలో యాదవులకు సీట్లు కేటాయించాలని రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షులు శబిసపు సాయికిరణ్ డిమాండ్ చేశారు.శనివారం స్థానిక మయూర హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో ఉన్న రాజయ పార్టీలు తమ యాదవ సంఘం నాయకులకు సీట్లు కేటాయించాలనికోరారు. ఈ విషయంపై ఈనెల 12వ వైసిపి జిల్లా అధ్యక్షులు, 14న టిడిపి జిల్లా అధ్యక్షులు, 16న జనసేన జిల్లా అధ్యక్షులు, 18న బిజెపి జిల్లా అధ్యక్షులను కలిపి వినతి పత్రాలు అందిస్తామని తెలిపారు. తమకు ఏ పార్టీ సీటు కేటాయిస్తుందో వారికే తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఎవరు గెలిచినా ఎక్కువ ఓట్లు తేడాతో గెలవడం లేదని, తమ ఓట్లు 25వేలు ఉన్నందున కచ్చితంగా ప్రభావం చూపిస్తామని తెలిపారు. అలా కానియెడల ఉద్యమ కార్యాచరణ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి.గణేష్, నాయకులు సురేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టియు జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్ టి యు) విజయనగరం జిల్లా కౌన్సిల్, నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక అమర్ భవన్ శనివారం జరిగింది. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.జోగారావు, ప్రధానకార్యదర్శిగా సిహెచ్.సూరిబాబు, కోశాధికారిగా బి.ఈశ్వర రావు, సంయుక్త అధ్యక్షులుగా ఎస్.చిట్టిబాబు, ఎం మురళి, ఉపాధ్యక్షులుగా ఎంవి లక్ష్మీనర సయ్య, ఎ.నాగేశ్వరరావు, డి.సరస్వతి, పి.రాజ్య లక్ష్మి, ఎంఎ స్వామి, అదనపు ప్రధాన కార్యద ర్శిగా పెంకి.రాంబాబు, జి రవి, కార్యదర్శులుగా మోపాడ తులసీరామ్, శ్రీనివాస దొర, సౌదామిని, యస్.మహేష్, వి.మల్లేశ్వరరావు, బి.అర్జునుడు, బి.అడివయ్య, ఎస్. బంగా రయ్య, మహిళా కన్వీనర్‌గా నాగేశ్వరి ,మైనారిటీ కన్వీనర్‌గా రహీం, సిపిఎస్ కన్వీనర్‌గా కె.రమేష్ ఎన్నికయ్యారు. మోడల్ స్కూల్ కన్వీనర్‌గా కె.చంద్రశేఖ, రాష్ట్ర కౌన్సిలర్‌గా డి.శ్యామ్, వి.గోవిందరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు సిపిఎస్ విధానంపై తమ వైఖరి ప్రకటించాలని. రానున్న ఎన్నికల్లో ఓట్ ఫర్ ఒపిఎస్ విధానాన్ని సంఘాలుగా తీసుకుంటామని తెలిపారు.

టిడిపిలోకి భారీ చేరికలు

ప్రజాశక్తి- బొబ్బిలి

రానున్న ఎన్నికల్లో బొబ్బిలి నియోజకవర్గంలో వైసిపికి దిమ్మతిరిగేలా టిడిపికి మెజారిటీ వస్తుందని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అన్నారు. మండలంలోని అలజంగి సర్పంచ్ రేజేటి భద్రమ్మ, ఎంపిటిసి రేజేటి బుజ్జి, వార్డు మెంబర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అధికార వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రెండు గ్రామాలకు చెందిన వైసిపి కుటుంబాలు భారీ ర్యాలీగా కోటకు చేరుకుని బేబినాయన సమక్షంలో టిడిపిలో చేరాయి. వీరందరికి బేబినాయన టిడిపి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనపై ప్రజలు, వైసిపి కార్యకర్తలు విసుగు చెంది టిడిపిలో చేరుతున్నారన్నారు. అనంతరం 400 వైసిపి కుటుంబాలు టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారితో బేబినాయన

నేరాలు ఘోరాలు

కిడ్నాప్ గ్యాంగ్ అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోఓని బాబామెట్టలో ఈనెల 6న కిడ్నాపింగ్‌కు పాల్పడిన సుపారీ గ్యాంగ్‌ను అరెస్టు చేసి, వారి నుంచి కిడ్నాప్‌కు వినియోగించిన మోటారుసైకిలు, కారుతో పాటు తులమున్నర బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి ఆర్.గోవిందరావు తెలిపారు. శనివారం టూటౌన్‌పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావే శంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం..

నగరంలోని బొండెల గూడెంకు చెందిన జోగ శివ కిషోర్ ... జమ్ము నారాయణరానికి చెందిన కటకోటి సతీష్ కుమార్ షాపును అద్దెకు తీసుకొని, తాగునీరు సరఫరా చేసే వ్యాపారం నిర్వహించేవాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య స్నేహం ఏర్పడడంతో శివకిషోర్ వద్ద నుంచి రూ.7లక్షలు అప్పుగా సతీష్‌కుమార్ తీసుకున్నాడు. సకాలంలో అప్పు చెల్లించకపోవడంతో జోగ శివ కిషోర్ కోర్టులో సతీష్‌కుమార్‌పై కేసు వేశాడు. ఈ ఆర్థిక విషయాలపై ఇరువురి మధ్య గొడవలు జరగడంతో జోగ కిశోర్ తన వ్యాపారాన్ని బాబామెట్టకు మార్చేశాడు. దీంతో ఆగ్రహించిన సతీష్‌కుమార్ శివకిషోర్‌ను కిడ్నాప్ చేసేందుకు అతని స్నేహితుడైన భీమిలికి చెందిన చుక్కా నూతన్‌సాయి కుమార్‌ను ఆశ్రయించగా, అతనికి ఈ తరహా దందాలకు పాల్పడే భీమిలికి చెందిన బంగారి గణేష్‌ను సాయంగా తీసుకున్నారు. ఈ సఫారి గ్యాంగ్‌తో కిడ్నాప్ చేసేందుకు రూ. 7 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. పథకం ప్రకారం ఈనెల 6న బాబామెట్టకు గ్యాంగు సభ్యులు చేరుకున్నారు. శివ కిషోర్ వాటర్ సరఫరా చేసేందుకు వ్యానులో బయలుదేరు తుండగా భీమిలికి చెందిన సురగల వరలక్ష్మి, మరో ఇద్దరు మోటారు సైకిల్‌పై వచ్చి వ్యానుకు అడ్డంగా పడిపోయినట్లుగా నటించగా, నిందితులు కారులో వచ్చి శివకిషోర్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకొని, పూసపాటిరేగ మైలాన్ కంపెని వైపు తీసుకొని వెళ్లిపోయారు. అక్కడ కత్తితో బెదిరించి, 15 ఖాళీ ప్రామిసరీ నోట్లపైనా, తెల్లకాగితాలపైనా, ఆధార్‌కార్డు జిరాక్సుపై సంతకాలు తీసుకొని, అనంతరం విచక్షణా రహితంగా కొట్టారు. అతని నుంచి తులమున్నర చైను, రెండు ఉంగరాలను కూడా బలవంతంగా తీసుకొని అక్కడే విడిచిపెట్టి పరారయ్యారు. నిందితుల్లో ఒకడైన బంగారి గణేష్‌పై రౌడీ షీటు ఉంది. నిందితులందరూ ఒక ముఠాగా ఏర్పడి, ఈ కిడ్నాప్‌కు యత్నించారు. బంగారు వస్తువులను భీమిలి ముత్తూట్ ఫైనాన్స్‌లో కుదవ పెట్టినట్లు, కారును ఒక్క రోజుకు అద్దెకు తీసుకొన్నట్లు విచారణలో అంగీకరించారు. ఎస్‌పి ఆదేశాలతో 2వ పట్టణ సిఐ కోరాడ రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐలు ఐ. దుర్గా ప్రసాద్, రాజేష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి, కిడ్నాప్ కేసు మిస్టరీని చేధించారని డిఎస్‌పి తెలిపారు. సమావేశంలో 2వ పట్టణ సిఐ కోరాడ రామారావు, ఎస్ఐలు దుర్గా ప్రసాద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి గోవిందరావు

బావిలో పడి వృద్ధుడు మృతి

బాడంగి: ప్రమాదశత్తు బావిలో పడి మృతి వృద్ధుడు దోమూడోరా పత్రుని రామారావు(65) మృతి చెందినట్లు ఎస్ఐ జయంతి తెలిపారు. విశాఖపట్నం మల్కాపురంలో నివాసం ఉంటున్న ఆయన స్వగ్రామం మండలంలోని పూడివలస గ్రామంలో పింఛన్ తీసికోవడానికి వచ్చాడు. అక్కడ నుంచి ముగడ బంధువులు దగ్గరకి వెళ్లి తిరిగి 9వ తేదీన పూడివలస వెళ్తాను అని చెప్పి వెళ్ళిపోయాడు. ఎప్పుడు లాగే పొలంలో వెళ్లడం అలవాటు అని ఆలా వెళ్లి బొత్స శ్రీను బావిలో పడి ఉండవచ్చు అని పోలీసులు అంచనా వేశారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ప్రతాప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

వంగర : మండలంలోని తలగాం గ్రామానికి చెందిన పొన్నాడ అప్పలనాయుడు(58) అదృశ్యమైనట్లు ఆయన భార్య పొన్నాడ లక్ష్మి శనివారం తెలిపారు. విశాఖపట్నంలో ఉన్న తన కుమార్తె వద్దకు వెళ్తానని చెప్పి ఈ నెల 8న గ్రామంలో బస్సు ఎక్కి వెళ్లిన తరువాత నుంచి కనిపించకపోవడంతో చుట్టాలు, బంధువులు ఇళ్ల వద్ద వాకాబు చేశామని అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం వంగర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె వెల్లడించారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వంగర

మండలంలోని చినరాజులు గుమ్మడ సమీపంలో ఈ నెల 5న ఆర్‌టిసి బస్సు ఆటో ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలైన విషయం విదితమే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండలంలోని శివ్వాం గ్రామానికి చెందిన కలమట రధాలు, శ్రీకాకుళం జిల్లాలోని రాగోలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం వేకుజామున మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి, కుమారుడు రాజశేఖర్, కుమార్తె ప్రేమలత ఉన్నారు. వీరంతా పేద కుటుంబం కావడంతో వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మద్యం రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - భోగాపురం

మద్యం అక్రమ రవాణా చేస్తున్న ఒక వ్యక్తిని భోగాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. రామచంద్రపేట పంచాయతీ తోటపల్లి గ్రామ శివారులో బమ్మిడిపేట గ్రామానికి చెందిన బమ్మిడి రామ సూరి అనే వ్యక్తి 42 మద్యం క్వార్టర్ బాటిల్స్‌ను శుక్రవారం సాయంత్రం తరలిస్తున్నారు. పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నారు. మద్యం బాటిల్స్‌తో పాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి రామసూరిని అదుపులోకి తీసుకొని కేసునమోదు చేశామని సిఐ రవికుమార్ తెలిపారు.